ప్రజాశక్తి
సోమవారం 19 ఫిబ్రవరి 2024 5
శ్రీ సత్యసాయి



నేడు స్పందన గ్రీవెన్స్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకోసం సోమవారం నాడు కలెక్టరేట్లో స్పందన గ్రీవెన్స్ కార్యక్రమాన్ని యథాతథంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్ బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా చేపడుతున్నట్లు తెలిపారు. పుట్టపర్తి కలెక్టరేట్లో స్పందన హాలు నందు జిల్లా స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కలెక్టరేట్లో స్పందన హాలులో సోమవారం ఉదయం9-30గంటల నుంచి స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు వారివారి సమస్యలను వినతులు రూపంలో అందజేయాలని పేర్కొన్నారు.

హామీల్లేవ్.. సమస్యల ప్రస్తావనా లేదు..!

- ఆత్మస్తుతి..పరనిందతోనే సరి
- సాదాసీదా ప్రసంగంతో ముఖ్యమంత్రి సిద్ధం సభ
- రాయలసీమ జిల్లాల నుంచి భారీగా జనసమీకరణ
- ఆర్టీసీ బస్సులన్నీ సభకు వెళ్లడంతో ప్రయాణికులకు ఇక్కట్లు



రాప్తాడలో నిర్వహించిన సిద్ధం బహిరంగ సభలో పాల్గొన్న వైసిపి శ్రేణులు



రాయలసీమ ప్రాంతాల నుంచి వచ్చిన వైసిపి శ్రేణులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికల సమయంలో రాజకీయ సభను అధికార వైసిపి పెట్టడంతో రాయలసీమ సమస్యలపై ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి స్పందిస్తారని అందరూ ఆశించారు. సమస్యల ప్రస్తావనగానీ, వాటి పరిష్కారానికి హామీలుగానీ ఏవీ లేకుండానే ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రసంగం సాగింది తాము అధికారంలోకి వచ్చాక అన్నీ చేసామని ప్రకటించుకోవడంపైనే ఎక్కువగా దృష్టి పెట్టారు. అదే సమయంలో టిడిపి అధికారంలో ఉండగా ఏమీ చేయలేదన్నది ప్రజలకు వివరించడానికి సమయం వెచ్చించారు. ఈ సభకు రాయలసీమ జిల్లాల నుంచి భారీగా జనసమీకరణను వైసిపి చేపట్టింది. దీంతో ఈ ప్రాంత సమస్యలపై కొంత వరకైనా స్పందిస్తారని ఆశించారు. కాని ఈ ప్రాంత సమస్యల ప్రస్తావన జోలికే వెళ్లలేదు.

99 శాతం హామీలు అమలు చేసాం
ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి

ఎన్నికల మ్యానిఫెస్టోలోని ఇచ్చిన హామీలను 99 శాతం పూర్తి చేస్తాని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సిద్ధం సభలో పునరుద్ఘాటించారు. పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. వారికి మేలు చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అధికారంలో ఉండగా ఏనాడూ ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోని టిడిపి ఇప్పుడు రంగురంగుల మ్యానిఫెస్టోతో ప్రజల ముందుకొచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. దీనికి మరికొంత మంది పెత్తందారులు తోడవుతున్నారని చెప్పారు. ఏదోరకంగా విజయం సాధించాలని ప్రయత్నాలను టిడిపి చేస్తోందన్నారు. దీనికి ధీటుగా వైసిపి నాయకులు, కార్యకర్తలు సంసిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన వారినే స్టార్ క్యాంపెయినర్లుగా మార్చాల్సిన అవసరముందని సూచించారు. పెత్తందారులకు, పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధమిది అని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి 175 అసెంబ్లీ స్థానాల్లోనూ, 25 పార్లమెంటు స్థానాల్లో గెలిపించే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే కాలంలోనూ సంక్షేమ అమలు జరగాలంటే వైసిపి రావాల్సిందేనని చెప్పారు. టిడిపి వస్తే అవి ఉండబోవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల వైసిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వాహనాలన్నీ సిద్ధం సభకు...జనంకు ఇక్కట్లు..!

సిద్ధం సభ కోసం భారీ జనసమీకరణను వైసిపి చేపట్టింది. ఇందుకు అవసరమైన అధికార బలాన్ని అంతటినీ ఉపయోగించింది. సుమారు ఆరు వేల వాహనాలను వినియోగించింది. ఇందులో ఆర్టీసీ బస్సులే అధికంగానున్నాయి. ఒక్క అనంతపురం జిల్లాకే 1520 బయటి బస్సులతోపాటు 520 ఉమ్మడి జిల్లా బస్సులు కేటాయించింది. ఇన్ని ఆర్టీసీ బస్సులను సిద్ధం సభకు జనం తరలించేందుకు కేటాయించడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. అదే సమయంలో జాతీయ రహదారి 44 ఆనుకుని సభను ఏర్పాటు చేయడంతో సభకు వచ్చే వాహనాలతో ట్రాఫిక్ జామ్ అయి గంటల తరబడి అటు బెంగళూరు, ఇటు హైదరాబాద్ వైపు వెళ్లే సాధారణ ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు.

కల్తీ నివారణకు చర్యలు

అనారోగ్యానికి కల్తీ ఆహార పదార్థాలే కారణం
కల్తీ ఆహార నియంత్రణ జిల్లా అధికారి రామచంద్ర



రామచంద్ర

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ప్రజారోగ్యం దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా కల్తీ ఆహార పదార్థాల నివారణకు ఎప్పటికప్పుడు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కల్తీ ఆహార నియంత్రణ అధికారి రామచంద్ర తెలిపారు. కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల ప్రజలు అనేక రోగా లు కొని తెచ్చుకుంటున్నారని, కావున కల్తీ ఆహార పదార్థాల పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలి. సమాజం వేగంగా అభివృద్ధి చెందు తుండడంతో అంతే వేగంగా కల్తీ ఆహార పదార్థాలు ఎక్కడపడితే అక్కడ విక్రయిస్తున్నారు. వాటిని తినటం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. హోటళ్ళు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, కిరాణా షాపుల్లో కల్తీ యథేచ్ఛగా జరుగుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండకపోతే ఆస్మా, క్యాన్సర్, తదితర రోగాలకు గురి కావాల్సి వస్తుంది. నేడు ఏ వస్తువు చూసినా కల్తీమయం అవుతోంది. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా కల్తీ అనేది సర్వసాధారణమవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా కల్తీ ఆహార నియంత్రణ అధికారి రామచంద్ర ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలు తెలిపారు.

ప్ర : కల్తీ ఆహారంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారా?

జవాబు : పాఠశాలలు, అవకాశం ఉన్న ప్రతిచోట కల్తీ ఆమారంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతు న్నాం. కొత్త జిల్లా ఏర్పడినందున తగినంత సిబ్బంది లేరు. వాహన సౌకర్యం కూడా లేదు. దీంతో ఇబ్బందులు పడుతూనే విధులు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉంది.

ప్రశ్న : ఆహార కల్తీని ఎలా నిర్ధారిస్తారు? తీసుకునే చర్యలు ఏమిటి?

జ : కల్తీ ఆహారాన్ని నియంత్రించ డానికి భారత ప్రభుత్వం 2016లో చట్టం తెచ్చింది. దీని ప్రకారం ఏడాదికి రూ. 12 లక్షల వరకు టర్నోవర్ ఉన్న వ్యాపారులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకొని లైసెన్స్ పొందాలి.



లైసెన్స్ లేని వారికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 6 లక్షల వరకు జరిమానా ఉంటుంది. హోటళ్లు, కిరాణా షాపుల్లో కాలం చెల్లిన వస్తువులు అమ్మితే నేరం. కల్తీ ఆహార పదార్థాలను హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు శాంపిల్ పంపుతాం. అక్కడి నుంచి 20 రోజులకు నివేదికలు వస్తాయి. వాటి ఆధారంగా కోర్టులో చట్టపరంగా శిక్షలు వేస్తారు. రిజిస్ట్రేషన్, లైసెన్సు ప్రక్రియ అన్నీ ఆన్‌లైన్ లో జరుగుతాయి.

ప్ర : కల్తీని ఏ ప్రాతిపదికన నిర్ధారిస్తారు ?

జ : కాలం చెల్లిన వస్తువులు విక్రయించడం చట్టరీత్యా నేరం. హోటళ్లలో వాడిన నూనెను తిరిగి రెండు మూడు రోజులు వాడుతుంటారు. దాని వల్ల క్యాన్సర్, ఆస్మా లాంటి రోగాలు వస్తాయి. ముఖ్యంగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో వాడిన నూనెను మళ్లీ మళ్లీ వాడుతూ ఉంటారు. ప్రస్తుతానికి అవి తినేటప్పుడు రుచికరంగా ఉన్నా వాటి వల్ల ఎన్నో అనర్థాలు కలుగుతాయి. కిరాణా షాపుల్లో గడువు ముగిసిన వస్తువులను విక్రయిస్తుంటారు. వాటిని వినియోగదారులు తీసుకోరాదు.

ప్ర : ప్రజలకు మీరు ఇచ్చే సలహాలు, సూచనలు ఏమిటి ?

జ : వస్తువులను కొనే ముందు ఎప్పుడు తయారు చేశారు. వస్తువుకు నిర్దేశించిన గడువు గమనించి కొనుగోలు చేయాలి. ఎట్టి పరిస్థితుల్లో గడువు పూర్తయిన వస్తువులను కొనరాదు. తాత్కాలికంగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల పదార్థాలు రుచిగా ఉన్నా, ఆయిల్ ఫుడ్ తినడం వల్ల రోగాలను మనమే కొని తెచ్చుకున్న వారమవుతాము. తాజాగా వేడి వేడి పదార్థాలనే భుజించాలి. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

సిఎం జగన్ సీమ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ

ప్రజాశక్తి-పెనుకొండ

హామీలు ఇచ్చి అమలు చేయకుండా మోసం చేసిన సిఎం జగన్ రాప్తాడు సిద్ధం సభలో రాయల సీమ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ డిమాండ్ చేశారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆదివారం సవితమ్మ మాట్లాడుతూ రాయలసీమ నమ్మక ద్రోహి జగన్ అన్నారు. వైసిపి ఓటమిని దేవుడు ముందే రాసిపెట్టాడన్నారు. రాప్తాడులో సభలో ఎందుకు పెట్టారో, దేనికి సిద్ధమో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. రాయలసీమ యువత కోసం పరిశ్ర మలు తెచ్చారా, రైతుల కోసం తాగు, సాగునీటి ప్రాజెక్టులు కట్టారా అన్నారు. రాయలసీమకు న్యాయ రాజధాని ఎక్కడ అన్నారు. హామీ మేరకు అంగన్వాడీలకు వేతనాలు పెంచారా, ప్రభుత్వ ఉద్యోగులకు ఒపిఎస్ అమలు చేశారా, నిరుద్యోగ యువత కోసం ఏటా జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ విడుదల చేశారా అని ప్రశ్నించారు. సీమను ఇండస్ట్రియల్ హబ్‌గా మారుస్తా.. కడపలో స్టీల్ ప్లాంట్ పూర్తి చేసి సీమకు అంకితం చేస్తానని ప్రగల్భాలు పలికిన జగన్ ఐదేళ్లలో రాయలసీమకు చేసింది జీరో అన్నారు. కార్యక్రమంలో డివి.ఆంజనేయులు, సూర్యనారాయణ, మాగేచెరువు సర్పంచి నరసింహులు, త్రివేంద్రనాయుడు, చిన్నపోతన్న, అంజనప్ప, వీరచిన్న, రాము పాల్గొన్నారు.

మంత్రి రోజాను కలిసిన వక్కలిగ రాష్ట్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్



మడకశిర : రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజాను ఆదివారం రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో కుంచితి వక్కలిగ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ నళిని ప్రత్యేకంగా కలిశారు. ఆమె మాట్లాడుతూ సిఎం జగన్ మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, అందులో భాగంగానే నియోజకవర్గంలో అధికంగా ఉన్న కుంచితి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ పదవిని మహిళలకు కేటాయించారన్నారు. మాజీ మంత్రి హెచ్‌బి నరసయ్యగౌడ్ కూతురు నళినిరంగయ్యగౌడ్ ప్రస్తుతం కుంచితి వక్కలిగ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. మహిళలకు అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యత కల్పించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు.

నేటి నుంచి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమ్మె

హిందూపురం : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సోమవారం నుంచి విధులను బహిష్కరించి సమ్మెలోకి వెళుతున్నట్లు సిఐటియు జిల్లా కోశాదికారి సాంబ శివ, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు జగదీష్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని తహశీల్దార్ కార్యలయం వద్ద విలేకరుల ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హిందూపురం పురపాలక సంఘంలోని మున్సిపల్ పారిశుధ్యకార్మికుల సమస్యలను పరిష్కరించాలని గత సంవత్సరం డిసెంబర్ 26 నుంచి ఈఏడాది జనవరి 10 వరకు సమ్మె చేశామన్నారు. సమ్మె సమయంలో హామీలను అమలు చేయాలని సోమవారం నుంచి సమ్మెలోకి వెళుతున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సిఐటియు, మున్సిపల్ యూనియన్ పట్టణ అధ్యక్షులు మల్లికార్జున, కోశాధికారి ఆనంద్, గురునాథ్, రామచంద్ర, మూర్తి, చంద్ర పాల్గొన్నారు.

రైతుల అరెస్టు హేయం : టిడిపి

ప్రజాశక్తి-మడకశిర

రైతాంగం సమస్యలపై పోరాడుతున్న రైతులను ఆదివారం పుట్టపర్తిలో అరెస్టు చేయడాన్ని నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి తీవ్రంగా ఖండించారు. పట్టణంలోని బాలాజీనగర్ పార్టీ కార్యాలయంలో ఆదివారం గుండుమల విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టు రైతులకు దాదాపు రూ. 67 కోట్ల ఇన్సెంటివ్ రావాల్సి ఉండగా ఇంతవరకు చెల్లించలేదని మండిపడ్డారు. రైతుల తరఫున రైతు సంఘం నాయకులు సిఎం గో బ్యాక్.. డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేయడం తప్పా అని ప్రశ్నించారు. తీవ్ర వర్షాభావంతో ఏటా నష్టాలు చవిచూస్తున్న రైతులను ఆదుకోవడానికి హంద్రీనీవా ద్వారా మడకశిర నియోజక వర్గానికి వెంటనే నీరు విడుదల చేయాలని కోరుతూ సిఎం జగన్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన రైతులను అక్రమంగా అరెస్ట్ చేసి వివిధ స్టేషన్లలో ఉంచడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన పోరాడే వారికి టిడిపి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. వెంటనే నియోజకవర్గానికి హంద్రీనీవా కాలువ ద్వారా నీరు సరఫరా చేసి పట్టు రైతులకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పట్టణ కన్వీనర్ మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మీడియా కోఆర్డినేటర్ రవికుమార్, నాయి బ్రాహ్మణ సాధికారిక జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు టిడిపి నాయకులు ఉన్నారు.



గుండుమల సమక్షంలో టిడిపిలో చేరిన మహిళలు

25 కుటుంబాలు టిడిపిలో చేరిక

పట్టణంలోని బాలాజీనగర్ టిడిపి కార్యాలయంలో గుండుమల తిప్పేస్వామి సమక్షంలో మండలంలోని అమిదాలగొంది పంచాయితీ టిడి పల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకురాళ్లు లక్ష్మి, గాయత్రి, గంగమ్మ, రత్నమ్మ, రంగమ్మ, లక్ష్మి, లక్ష్మీబాయి, శ్యామల బాయ్, నాగరాజునాయక్, ఆకాష్ నాయక్, రాజునాయక్, గోవింద నాయక్, నాగరాజప్ప, తదితర 25 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వారికి గుండుమల తిప్పేస్వామి పసుపు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారు మాట్లాడుతూ సిఎం జగన్ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించార ని, నవరత్నాలు వట్టి బూటకమని, వైసిపిలో న్యాయం జరగలేదని, అందుకే టిడిపిలో చేరామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కోట్ల రంగయ్యగౌడ్, జిల్లా బిసి సెల్ కార్యదర్శి టిడి పల్లి గిరి, నాయకులు నాగేంద్ర, నారాయణ, నరసింహప్ప, వంగేనాయక్ పాల్గొన్నారు.

నందమూరి తారకరత్నకు నివాళి



పెనుకొండలో తారకరత్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధి కుమారు డు సాయికళ్యాణ్ ఆధ్వర్యంలో నందమూరి తారకరత్న ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. తారకరత్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు రవిశంకర్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చిన్న వెంకటరాముడు, కన్నాస్వామి, పులగుర శ్రీనివాసులు, సాయిప్రసాద్, పోతిరెడ్డి, బోయ అనిల్‌కుమార్, షౌకత్, వాజిద్, గుట్టురు నాగరాజు, నాగప్ప, బాలునాయక్, నాని, వరప్రసాద్, సానిపల్లి సూరి, మహమ్మద్, నవీన్‌కుమార్, జిరాక్స్ శీన, షీప్ ఫారం శీన, సాధిక్, గోనిపేట వెంకటేష్, జిలాన్, చిన్న రాయల్, తోటగేరి శివ, ప్రసాద్ పాల్గొన్నారు.

మడకశిర : సినీనటుడు, టిడిపి నేత నందమూరి తారకరత్న ప్రథమ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని బాలాజీనగర్ టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో తెలుగుతమ్ముళ్లు తారకరత్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమం లో పట్టణ, మండల కన్వీనర్లు మనోహర్, లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శులు పుల్లయ్య చౌదరి, రంగయ్యగౌడ్, కౌన్సిలర్ ఉమాశంకర్, తెలుగు యువత నాయకులు తిమ్మరాజు, బిసి సెల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కాంతరాజు, రవి, మార్కెట్ బాబు, కోర్టు నాగరాజు, నాగరాజు, హరేసముద్రం కరియన్న, మూర్తి, నాగేంద్ర, లోకేష్, బుల్లెట్ శంకర్, రమేష్, మంజు, హనుమంతప్ప పాల్గొన్నారు.



విజయోత్సవ సంబరాలు చేసుకుంటున్న అంగన్వాడీలు

అంగన్వాడీల విజయోత్సవ సంబరాలు

ప్రజాశక్తి-రొద్దం

అంగన్వాడీ సిబ్బంది ఆదివారం రొద్దం అంగన్వాడీ సెంటర్‌లో విజయోత్సవ సభ నిర్వహించారు. ముందుగా భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్‌ను ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ తమ సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో 42 రోజుల పాటు సమ్మె చేసి విజయం సాధించామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్, అధ్యక్ష, కార్యదర్శులు జయమ్మ, బావమ్మ, జయతుంబి, అనిత పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షల అట్టలు పంపిణీ

రొద్దం : మండలంలోని మహాత్మ జ్యోతిబా పూలే పాఠశాల లో ఆదివారం పదో తరగతి విద్యార్థుల కు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. సత్యసాయి భక్తులు అందజేసిన ఎగ్జామ ప్యాడ్స్‌ను ప్రిన్సిపల్ గోపాల్ ఆధ్వర్యంలో రవికుమార్, రిటైర్డ్ ఎజిఒ శ్రీరామప్ప, షామీర్ 67 మంది విద్యార్థులకు అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులందరూ బాగా చదివి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి గుర్తింపు తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ, రామకృష్ణ, మంజు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేసిన ప్రిన్సిపల్ గోపాల్



పుట్టపర్తి విమానాశ్రయం ముందు భవనంపై నుంచి ఫ్లెక్సీలు ప్రదర్శించి నిరసన తెలుపుతున్న మడకశిర ప్రాంత రైతులు

ముఖ్యమంత్రికి రైతుల నిరసన సెగ

- పుట్టపర్తి విమానాశ్రయం వద్ద ఫ్లెక్సీలు చూపి ఆందోళన
- అడ్డుకున్న పోలీసులు.. రైతుల అరెస్టు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి రైతుల నుంచి నిరసన సెగ తగిలింది. ఆదివారం మధ్యాహ్నం పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న సిఎం జగన్మోహన్‌రెడ్డిని కలిసేందుకు మడకశిర ప్రాంతానికి చెందిన రైతులు పోలీసులు అనుమతి కోరారు. సమస్యలపై వినతిపత్రం అందించేందుకు అనుమతి ఇవ్వాలని కోరగా అందుకు పోలీసులు అంగీకరించలేదు. దీంతో రైతులు పుట్టపర్తి విమానాశ్రయం ముందు ఓ భవనంపైకి ఎక్కి పోస్టర్లు ప్రదర్శించి నిరసన తెలిపారు. భవనంపైన నిరసన తెలుపుతున్న వారిని సైతం పోలీసులు వదలకుండా బలవంతంగా వారిని అక్కడి నుంచి కిందకు దింపేశారు. ఈ సమయంలో రైతులు రోడ్డుపై పడుకుని నిరసన తెలిపారు. వారిని బలవంతంగా పోలీసు వాహనంలో ఎక్కించి బుక్కపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ముఖ్యమంత్రి పర్యటన ముగిసేంత వరకు వారిని అక్కడే ఉంచి అనంతరం విడుదల చేశారు. రైతు సమస్యలను ముఖ్యమంత్రికి చెబుదామని వస్తే ఇలా అడ్డుకోవడం సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఇలా అడ్డగింపులను ఆపి రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కోరారు. సాగునీరు లేక మడకశిర ప్రాంతంలో రైతులు జీవనం దుర్భరంగా మారిందన్నారు. ఈ పరిస్థితుల్లో గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పంటల సాగు నిమిత్తం మడకశిర బ్రాంచి కెనాల్‌కు నీరివ్వాలన్నారు. పట్టుగూళ్ల విక్రయాల్లో రైతులకు ఇస్తున్న కిలోకి 50 రూపాయలు ప్రోత్సాహం రూ.4 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని తక్షణం విడుదల చేయాలని కోరారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి స్పందించాలని కోరారు.

టిడిపి అనుబంధ సంఘాల కమిటీలు ఏర్పాటు

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని బాలాజీనగర్ టిడిపి కార్యాలయంలో ఆదివారం రొళ్ల మండల టిడిపి అనుబంధ సంఘాల కమిటీలను ఎన్నుకున్నారు. బిసి సెల్ మండల అధ్యక్షులుగా బి.నాగరాజు, ప్రధాన కార్యదర్శి గా ఈఎం.నాగరాజు, తెలుగు యువత అధ్యక్షులుగా ఉమేష్, ప్రధాన కార్యదర్శిగా కెబి.రాజన్న, టిఎన్ ఎస్ఎఫ్ అధ్యక్షులుగా చంద్రరాజు, ప్రధాన కార్యదర్శిగా శాంతరాజు, టిఎన్‌టియుసి అధ్యక్షులుగా దొడ్డ లింగప్ప, ప్రధాన కార్యదర్శిగా రామన్న, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా నరసింహమూర్తి, ప్రధాన కార్యద ర్శిగా మంజునాథ, ఎస్టీ సెల్ అధ్యక్షులుగా హనుమంతనాయక్, ప్రధాన కార్యదర్శిగా మంజునాయక్, తెలుగు మహిళ అధ్యక్షురాలిగా రత్నమ్మ, ప్రధాన కార్యదర్శిగా కమలమ్మ, తెలుగు రైతు అధ్యక్షులుగా లక్ష్మీపతి, కెంపరాజు, అధ్యక్షులుగా మహమ్మద్‌రఫీక్, ప్రధాన కార్యదర్శిగా ఇస్మాయిల్‌సాబ్‌లను ఎన్నుకున్నారు.

ఘనంగా కెంపేగౌడ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-మడకశిర

గుడిబండ మండలం శంకరగల్లు గ్రామ కుంచితి కుల బాంధవుల ఆధ్వర్యంలో శంకర గల్లులో ఆదివారం నాడప్రభు కెంపేగౌడ విగ్రహ ఏర్పాటు, విగ్రహావిష్కరణ, కెంపేగౌడ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కుంచితి వక్కలిగ నాయకులు అశ్వర్థప్ప, నరసేగౌడ, సర్పంచి నరేంద్ర, రంగేగౌడ, శ్రీనివాసరెడ్డి, హనుమంతరాయప్ప, నాగరాజు, రమేష్, నాయకులు, యువకులు, కుల బాంధవులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి...

మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం, అక్రమ కట్టడాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుని పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి హిందూపురాన్ని రాష్ట్రంలోనే ఉత్తమ పురపాలక సంఘంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. నూతనంగా భాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి పట్టణాభివృద్ధిపై ప్రజాశక్తితో మాట్లాడారు.

ప్ర : పట్టణ పారిశుధ్యంపై ఎలాంటి చర్యలు తీసుకొంటున్నారు ?

జవాబు: పట్టణంలో పారిశుధ్య మెరుకు ప్రత్యేక దృష్టి సారించాం. ప్రస్తుతం 80 మంది పర్మినెంట్ కార్మికులు, 220 మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు. పట్టణ జనాభాకు అనుగుణంగా ఈ కార్మికుల సంఖ్య తక్కువగా వుంది. కోవిడ్ సమయంలో మరో 80 మంది కార్మికులను తీసుకున్నాం. వారితో రాత్రి సమయంలో పారిశుధ్య పనులు చేపడుతున్నాం.

ప్ర : పారిశుధ్య మెరుగుకు ప్రణాళికలు రూపొందించారా ?

జ : పారిశుధ్య మెరుగుకు ప్రణాళికలను రూపొందించుకున్నాం. ఉదయం పూట ప్రధాన రహదారులు శుభ్రం చేస్తే పాదాచారులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. దీని కోసం నైట్ శానిటేషన్ పనులను ప్రారంభించాం. సచివాలయ వ్యవస్థ రావడంతో అందులో ప్రత్యేకంగా శానిటేషన్ సెక్రేటరిని నియమించడంతో నిరంతరం పర్యవేక్షణ చేస్తు పట్టణాన్ని సర్వంగా సుందరంగా తీర్చదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర : అక్రమ కట్టడాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : పట్టణ వ్యాప్తంగా అక్రమ కట్టడాలను గుర్తించడానికి కొంత మంది అధికారులను ఏర్పాటు చేశాం. పురపాలక సంఘ వ్యాప్తంగా 43 సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాయాలనికి ఒక ప్లానింగ్ సెక్రేటరీని నియమించారు. వీరితో పాటు 50 గృహాలకు ఒక వాలంటీర్‌ను నియమించారు. వాలంటీర్లు, వార్డు ప్లానింగ్ సెక్రేటరీల ద్వారా అక్రమ కట్టడాలను గుర్తించి వాటిని సక్రమ కట్టడంగా మారుస్తాం. ఈ విషయంలో ఇప్పటికే పలు వార్డుల్లో అక్రమ కట్టడాలపై చార్జీషీట్లను వేయడం జరిగింది. వీటితో పాటు అక్రమ లే అవుట్లను గుర్తించి శాఖ పరమైన చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర : షెడ్ల నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకొంటున్నారు ?

జ : పురపాలక సంఘంలో వారి సొంత స్థలాలలో పక్కా భవనాలు కట్టుకోవడానికి అనుమతులు అవసరమవుతాయి. వారి స్థలంలో తాత్కాలికంగా ప్రహరీలు, షెడ్ల నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు అవసరం ఉండదు. అయినప్పటికీ పట్టణ వ్యాప్తంగా ఈ మధ్య కాలంలో వెలసిన షెడ్ల నిర్మాణాలపై తనిఖీలు నిర్వహించి ఆ షెడ్లు దేనికి వాడుతున్నారో పరిశీలించి నిబంధనల మేరకు వారిపై చర్యలు తీసుకుంటాం.

ప్ర : అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి ప్రణాళికలు రూపొందించారా ?

జ : పట్టణంలో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయన్నది వాస్తవం. గత ప్రభుత్వం పట్టణ వ్యాప్తంగా మౌలిక సదుపాయాల కోసం రూ.66 కోట్లు, పైపులైను ఏర్పాటుకు రూ.75 కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగింది. అయితే ఈ నిధులు ఇప్పటికి రాలేదు. ఇక ఆ నిధులు వస్తాయన్న ఆశలను వదలుకున్నాము. ఏలాగైన పట్టణాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పించి అహుడా నుండి రూ.2.25కోట్లు నిధులు మంజూరు చేయించుకున్నాం. ఈ నిధులతో రైల్వే రోడ్డును అభివృద్ధి చేస్తున్నాం. మున్సిపల్ ఆదాయంలో ఎక్కువ శాతం గొల్లపల్లి నుంచి వస్తున్న నీటి నిర్వహణ, ఈ పథకం కోసం చేసిన అప్పులకు సంబందించి ఈఎంఐలు చెల్లించాల్సుంది. ఈ విషయాలను స్థానిక ఇన్‌చార్జి దీపిక వేణురెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం.

ప్ర : బిల్లులు ఎక్కడి కక్కడ అగిపోయాయి.. సరి దిద్దాడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ: ప్రభుత్వం ప్రీ ఆడిట్ తీసుకు రావడంతో బిల్లుల మంజూరులో అలస్యం అవుతోంది. దీనివల్ల అభివృద్ధి పనులు సైతం ఆగిపోయాయి. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లం జరిగింది. సమస్యను త్వరలో పరిష్కరిస్తాం.

ప్రజాశక్తి: వీధిజంతువుల సంచారంతో ప్రజలు విసిగిపోతున్నారు. ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారు.?

జ : కుక్కలు, పందులు, ఆవులు, కోతులు పెద్ద సమస్యగా మారాయి. ఇతర ప్రాంతాల నుంచి ప్రత్యేక సిబ్బందిని పిలిపించి, వారితో కుక్కలు, కోతులు పట్టిస్తాం. ఆవులను గోశాలకు తరలిస్తాం. రోడ్డుకు అడ్డంగా ఉన్న ఆవుల యజమానులకు జరిమానాలు విధించడానికి చర్యలు తీసుకుంటున్నాం. పందులు తరలించేందుకు కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. అయినా ఇతర రాష్ట్రాలకు తరలించే చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర : క్లాప్ కార్యక్రమం ఎంత వరకు అమలు చేస్తున్నారు.?

జ : హిందూపురం పురపాలక సంఘంలో క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) దిశగా అడుగులు వేస్తున్నాం. అయితే గుత్తేదారులు క్లాప్ ఆటో ప్రడైవర్లకు వేతనాలు ఇవ్వక పోవడంతో వారు క్లాప్ ఆటోలను నిలిపివేసి సమ్మెలోకి వెళ్లారు. అయినప్పటికి ఇప్పటికే అన్ని వార్డుల్లో ప్రజలకు ఇంటికి మూడు బుట్టలను అందించి, ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. సమస్యలు ఉన్నప్పటికి క్లీన్ హిందూపురం లక్ష్యంగా ప్రణాళికలను రూపొందించి ముందుకు సాగుతున్నాం.

ప్ర : కౌన్సిల్ సహకారం ఎలా ఉంది.?

జ : ఇటీవలే నేను నూతనంగా బాధ్యతలు స్వీకరించాను. పాలక వర్గం నుంచి పూర్తి స్థాయి సహాయసహకారాలు అందుతున్నాయి. పార్టీలకు అతీతంగా అన్ని వార్డుల కౌన్సిలర్లను కలుపుకుని పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్ది రాష్ట్రంలోనే గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తాం.

ప్ర : సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఏలాంటి చర్యలు తీసుకున్నారు.?



హిందూపురం మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

జ : 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పురపాలక సంఘ వ్యాప్తంగా పురుషులు 63534, మహిళలు 62.941, ఇతరులు 13 మంది ఉన్నారు. వీరికి ఇప్పటికే పోలీంగ్ కేంద్రాలను గుర్తించారు. అన్ని పోలీంగ్ కేంద్రాలలో ఓటర్లకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేస్తాం. అధికారులు, సిబ్బంది సహకారంతో సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిస్తాం.

కేజీబీవీ తనిఖీ

తనకల్లు : మండల కేంద్రంలోని కెజిబివిని జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు, జిల్లా మానవ హక్కుల పరిరక్షణ సంస్థ చైర్మన్ చెరుకూరి గంగులయ్య ఆదివారం తనిఖీ చేశారు. పాఠశాలలో 400 మంది పిల్లలకు గాను 183 మంది, 17 మంది ఇంటర్మీడియట్ పిల్లలు హాజరుగా ఉన్నారు. ఈ సందర్భంగా గంగులయ్య పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా వర్కింగ్ చైర్మన్ కోటకొండ కిష్టప్ప, కదిరి డివిజన్ చైర్మన్ గోగినేని మునీంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

తెలుగు ప్రొఫెషనల్ వింగ్ పుట్టపర్తి అసెంబ్లీ కమిటీ నియామకం

పుట్టపర్తి రూరల్ : టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు తెలుగు ప్రొఫెషనల్ వింగ్ పుట్టపర్తి అసెంబ్లీ కమిటీని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా జూటూరు అశోక్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా గనిపినేని బాలకృష్ణ, అవుల నాగార్జునను నియమిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ పార్టీకి చేసిన సేవలు గుర్తించి తెలుగు ప్రొఫెషనల్ వింగ్ పుట్టపర్తి అసెంబ్లీ కమిటీలో స్థానం కల్పించినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవకాశం కల్పించిన పల్లె రఘునాథ్ రెడ్డి కి, తెలుగు ప్రొఫెషనల్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ తేజస్వి పొడపాటికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూపురం పార్లమెంటు ప్రధాన కార్యదర్శి శివరాజ్ కుమార్, వేమూరి మనోజ్ కుమార్, సురేంద్ర నాయుడు, లింగప్పగారి పల్లి రవిరాజు, మిట్టపల్లి హరి, రెడ్డిపల్లి గణేష్, దున్నికోట మధునాయుడు, గూనిపల్లి దివాకర్, అప్పన్నగారి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పరిగి : ప్రైవేట్ డ్రైవర్లుగా జీవనం కొనసాగిస్తూ అరకొర కూలితో జీవనోపాధి పొందుతున్న కూలీలను ప్రభుత్వం ఆదుకునే చర్యల్లో భాగంగా వారికి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆల్ ఆంధ్ర డ్రైవర్స్, క్లీనర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం పరిగి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మండల కమిటీ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులు పాల్గన్నారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల శ్రమదానం

హిందూపురం : ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా పట్టణంలోని బాలయేసు డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పరిగి మండలం కోనాపురం గ్రామంలో ఆదివారం శ్రమదానం చేశారు. మురుగు కాలువలను శుభ్రం చేసి, దోమల నివారణ కోసం బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ సందర్భంగా యూనిట్ 1 పోగ్రాం అధికారి అశ్వర్థ నారాయణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. జియావుల్లాఖాన్ మాట్లాడుతూ పారిశుధ్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు అధ్యాపకులు శివరామ రెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

తోటి కార్మికుడికి సాయం

హిందూపురం : హిందూపురం రూరల్ మండలం తూమకుంట పారిశ్రామిక వాడలోని రోల్ వెల్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న కార్మికుడు శివరాజన్ ఆనారోగ్యంతో భాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న తోటి కార్మికులు రూ.20వేలు సేకరించుకుని కార్మికుడు శివరాజన్‌కు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రోల్‌వెల్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు రవికుమార్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, హరీష్ రెడ్డి, నాయకులు చిన్నప్పయ్య, అబ్రార్, శ్రీరాములు, మహబూబ్‌బాషా, బాలకృష్ణ, హనుమంత రాయుడు, వివిఎల్ నాగరాజు, అతావుల్లా, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మూర్ఛవ్యాధి చికిత్స శిబిరం

హిందూపురం : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతి నెల మూర్ఛవ్యాధి గ్రస్తులకు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరం ఆదివారం పట్టణంలోని ఆర్‌పిజిటి రోడ్డులోని ఆల్ హిలాల్ పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ ఇటి. రామ్మూర్తి 156 మంది మూర్ఛ రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి వారికి రెండు నెలలకు సరిపడు మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధిని నియంత్రించ వచ్చని అన్నారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు జెవివి నాయకులు అంజన రెడ్డి, జిఆర్ శ్రీనివాసులు, రామకృష్ణ, అతావుల్లా, నాగేంద్రాచారి, లక్ష్మిపతి, నాగరాజ గుప్త, ఉగ్రప్ప, సుబ్రమణ్యానాయక్, మంజునాథ చారి, బావుద్దీన్, ఉమామహేష్, చంద్రశేఖర్‌రెడ్డి, అబ్దుల్ హక్ పాల్గొన్నారు.

'జూపూడి' వ్యాఖ్యలు అభ్యంతరకరం

కదిరి టౌన్ : అంబేద్కర్ విదేశీ విద్య పథకం పేరు మార్పుచేసి జగన్ విదేశీ విద్యగా మార్పు చేసిన అభ్యంతరం లేదని జూపూడి ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరం అని టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజశేఖర్ బాబు అన్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని కందికుంట నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతపై ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారుడు జూపూడి ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జగన్మోహన్ రెడ్డి కేవలం తన పేరు కోసమే అంబేద్కర్ పేరును తొలగించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విశ్వనాథ్, రామాంజి, చిన్నప్ప, గంగాధర్, నరసింహ, కిష్టప్ప, హరి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో ధర్మవరం విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

అంతర్జాతీయ అబాకస్ పోటీలలో ధర్మవరానికి చెందిన మిరాకిల్ ఎడ్యుకేషన్ సెంటర్ విద్యార్థులు సత్తా చాటారని డైరెక్టర్ శ్రీవాణి, సంస్థ ఫ్రాంచైజీ చంద్రశేఖర్ తెలిపారు. అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో ప్రతిభ చూపిన ధర్మవరం విద్యార్థులను పట్టణంలోని ఎన్జీవో హోంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వైద్యులు శీబా నగేష్‌గుప్త, న్యాయవాది క్రిష్ణమోహన్ తదితరులు విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల చెన్నైలో జరిగిన 8వ అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో ధర్మవరానికి చెందిన మిరాకిల్ ఎడ్యుకేషన్ సెంటర్‌కు చెందిన 22 మంది విద్యార్థులు బహుమతులు సాధించారన్నారు. నాగహితశ్రీ, తేజక్రిష్ణ ఛాంపియన్ షిప్ సాధించారన్నారు. కేదార్నాథ్, సంజయ్, జాన్వి, విఖ్యాత్, భవిన్సాయి అత్యున్నత ప్రతిభ కనబరిచి గ్రాడ్యుయేషన్ అర్హత సాధించారన్నారు. హేమన్య, నాగసాయి ఆదర్శ్, అక్షిత్, జశ్వంత్, ఆదిత్య, శ్రీనిత్య, సాయివర్షిణి, హిమజ, భానుప్రకాష్, భవ్య, మోక్షజ్ఞ, గ్రీష్మ, కావ్యలు విన్నర్‌షిప్ సాధించారని తెలిపారు.



అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో వైద్యులు,లాయర్

అంతర్జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించాలని కోరారు.

ఏం చేశారని సిద్ధం బహిరంగ సభ .? : పల్లె



విలేకరులతో మాట్లాడుతున్న పల్లె

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ప్రజలకు ఏం చేశానిని సిద్ధం బహిరంగ సభను జగన్ రెడ్డి నిర్వహించారని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పల్లె మాట్లాడారు. వైసిపి పాలనా వైఫల్యాలను ప్రజలకు సమాధానం చెప్పడానికి జగన్ సిద్ధమా అని సవాల్ విసిరారు. మద్యం, ఇసుక, మట్టి గ్రానైట్ దోపిడీ చేసినందుకు సిద్ధం సభ నిర్వహించారా లేక రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం పూర్తి చేయనందుకా అని ఎద్దేవా చేశారు.? ఈ ఐదేళ్లలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు బిల్లులు ఇవ్వకుండా కాంట్రాక్టర్లను వేధించి వారు ఆత్మహత్య చేసుకున్నందుకా.. పుట్టపర్తి నియోజకవర్గంలో 193 చెరువులకు నీళ్లు ఇవ్వనందుకా.. పాలనలో మొత్తం అరాచకాలు దోపిడీ, దౌర్జన్యాలు చేసినందుకా.. సిద్ధం సభ నిర్వహించారని ఎద్దేవా చేశారు. ఎన్నిసార్లు పుట్టపర్తి విమానాశ్రయానికి వచ్చారో సిఎంకు గుర్తు ఉందా అని ప్రశ్నించారు. ఒక్క రూపాయి అయినా నియోజకవర్గానికి ఇచ్చావా అని పల్లె నిలదీశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాల ప్రజలకు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని పల్లె డిమాండ్ చేశారు

వైసిపి హయాంలో రాయలసీమకు అన్యాయం : జనసేన

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

కరువు పేరు చెప్పి రాయలసీమ ప్రజలను ఎన్నిసార్లు మోసం చేస్తారని ముఖ్యమంత్రి జగన్ రెడ్డిపై జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాలుగా రాయలసీమ ప్రజలను మోసపు ప్రకటనలతో చేసిన మోసం చాలని అన్నారు. జగన్‌ను నమ్మేవారు ఎవరూ లేరని తెలిపారు. రాయలసీమ యువత కోసం ఏం చేశారని బహిరంగ సభ నిర్వహించారని ప్రశ్నించారు. యువత కోసం ఎన్ని ఫ్యాక్టరీలు తీసుకొచ్చి, ఎంతమందికి ఉద్యోగాలు కల్పించావో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రజలే వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు.



విలేకరులతో మాట్లాడుతున్న చిలకం

వైసిపిలో 50 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

మండల పరిధిలోని గొట్లూరు గ్రామానికి చెందిన 50 కుటుంబాలు వైసిపిలో చేరాయి. గ్రామానికి చెందిన గొట్లూరు పవన్, అతని మిత్రులు, బంధువులకు చెందిన మొత్తం 50 కుటుంబాలు వైసిపిలో చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వారికి పార్టీ కండువా కప్పి వైసిపిలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాల వారికి, రాజకీయాలకి పార్టీలో చేరిన వారు వైసిపి అభివృద్ధికి పనిచేయాలని కోరారు.



పార్టీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే కేతిరెడ్డి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

చిలమత్తూరు : కొడికొండ చెక్‌పోస్టు జెంగీ డాబా 44 వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. బెంగుళూరు వైపు నుండి వస్తున్న మినీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహదారుడు మొరంపల్లి గ్రామానికి చెందిన రామచంద్రా రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. మరో వ్యక్తి చిలమత్తూరు కి చెందిన రామారావు తీవ్ర గాయాల పాలయ్యాయి. అతని పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదానికి కారణమైన మినీబస్సు డ్రైవర్ పోలీస్ స్టేషన్ కి వచ్చి సరెండర్ అయ్యాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. శనివారం ఈ ప్రాంతం సమీపంలో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఆఘటన మరువకముందే అదే ప్రాంతంలో మరో ప్రమాదం చోటు చేసుకుంది.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

హిందూపురం : లేపాక్షి మండలం నవోదయ పాఠశాల ఆవరణంలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో 9వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల పోటీలకు అనంతపురం ఉమ్మడి జిల్లా హ్యాడ్ బాల్ మహిళా, పురుషుల జట్లను ఎంపిక చేశారు. ప్రిన్సిపల్ నాగరాజు, వివేకానంద, సందీప్, వేదవతి, యాసిన్ మాలిక్, అర్షియ భాను తదితరులు క్రీడాకారుల ఆటను పరిశీలించి జట్లను ఎంపిక చేశారు. మహిళా జట్టులో కుమారి జ్యోతిక, కే లలిత, శ్రీ నిఖిత, దివ్య, నాగ, హర్షిత, జాహ్నవి, వర్షిత, హేమలత, శ్రీ రేణుక రెడ్డి, సాయి కీర్తి, నిఖిత, ఎం చెర్రీ, జాస్మిన్, చందన, ప్రశాంతి లక్ష్మి, సూచితా రెడ్డి, వెన్నెల, లిఖితను ఎంపిక చేశారు. జట్టుకు మేనేజర్ అండ్ కోచ్ గా నవోదయ పాఠశాల పీడీ వేదవతిని నియమించారు. అలాగే పురుషుల జట్టులో సందీప్ కుమార్, బి జీవన్ రెడ్డి, యాగ్ని ఈశ్వర్, ఏ అమన్, జస్వంత్, వంశీ, యశ్వంత్, నరేష్ కుమార్, భరత్, శ్రీ సాయినాథ్, మనోజ్ కుమార్, శివరాజ్, సందీప్ కుమార్‌ను ఎంపిక చేశారు. ఎంపికైన రెండు జట్లు ఈ నెల 23, 24 తేదీల్లో నంద్యాలలోని శ్రీ రామలింగా రెడ్డి డిగ్రీ కళాశాలలో జరిగే 9వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. ఎంపికైన జిల్లా జట్ల సభ్యులకు జిల్లా హ్యాండ్ బాల్ సంఘ అధ్యక్ష కార్యదర్శులు ఎం బలరాం రెడ్డి, ముస్తఫా కమల్‌బాసా అభినందించారు.



ఎంపికైన మహిళ, పురుష హ్యాండ్ బాల్ జట్ల క్రీడాకారులు

తాగునీటి కష్టాలు

నంబులపూలకుంట : మండల కేంద్రంలోని కొత్త రోడ్డు వద్ద ఉన్న కాలనీవాసులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోలేదని వాపోతున్నారు. మండల కేంద్రంలోనే సమస్య ఇలా ఉంటే ఇక గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని వారు అంటున్నారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

'వైసీపీదే అధికారం'

కదిరి టౌన్ : రాబోయే ఎన్నికల్లో వైసీపీదే అధికారమని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాక్బుల్ జోస్యం చెప్పారు. ఆదివారం ఉమ్మడి అనంతపురం జిల్లా రాప్తాడు లో నిర్వహించిన ముఖ్యమంత్రి సిద్ధం సభకు కదిరి వైసీపీ శ్రేణులు అధికసంఖ్యలో తరలివెళ్లాయి. వైసీపీ ఇన్‌ఛార్జి మాక్బుల్ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బత్తల హరిప్రసాద్, వెంకటరమణ, పరికి సాదిక్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



కదిరిలో జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న మక్బూల్

పుట్టపర్తి అర్బన్ : అనంతపురం జిల్లా రాప్తాడు లో జరిగిన సిద్ధం బహిరంగ సభకు పుట్టపర్తి నియోజకవర్గం నుంచి వైసీపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లాయి. పుట్టపర్తి శాసనసభ్యులు దిద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సిద్ధం సభకు అధికసంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. సత్యసాయి జిల్లా నుండి 243 ఆర్టీసీ బస్సులు కేటాయించారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు కేటాయించిన గ్రామాలకు బస్సులు చేరుకున్నాయి. నిన్న మధ్యాహ్నం నుండి ఆదివారం రాత్రి వరకు ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు. ప్రైవేటు వాహనాలు కూడా అందుబాటులో లేక పోవడంతో ఇబ్బందులు పడ్డారు.

బత్తలపల్లి : సిఎం జగన్మోహన్‌రెడ్డి రాప్తాడులో ఆదివారం నిర్వహించిన సిద్ధం సభకు బత్తలపల్లి మండలం నుంచి భారీగా వైసిపి శ్రేణులు తరలివెళ్లాయి. వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు దాదాపు 60 వాహనాల్లో తరలివెళ్లారు.

వికలాంగుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ఆత్మకూరు : మండల కేంద్రానికి చెందిన వికలాంగుడు గొల్ల అక్కలన్నపై దాడి చేసిన వారిని శిక్షించాలని ఆదివారం వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగుల సంఘం మండల కార్యదర్శి గంగన్న మాట్లాడుతూ గొర్రెలు మేపుకుంటూ జీవిస్తున్న వికలాంగుడు అక్కలన్నను ఇంటి పక్కన ఉన్నవాళ్లు దాడి చేయడం బాధాకరమన్నారు. అంతేగాకుండా అక్కలన్న భార్యను అవమానిస్తూ దుర్భాషలాడటం దురదృష్టకరమన్నారు. దాడి చేయడంతో అక్కలన్న అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. వెంటనే వికలాంగుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పుట్టపర్తిలో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



ముఖ్యమంత్రికి శాలువా కప్పుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి విమానాశ్రయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికి ఘన స్వాగతం లభించింది. జిల్లాలో ఒకరోజు పర్యటనలో భాగంగా ఆదివారం రాప్తాడులో నిర్వహించే సిద్ధం బహిరంగ సభ కార్యక్రమానికి గన్నవరం విమానాశ్రయం నుండి బయలుదేరిన ముఖ్యమంత్రి మధ్యాహ్నం 2.45 నిమిషాలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకున్నారు. విమానాశ్రయం వద్ద అధికారులు, అనధికారులు ముఖ్యమంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక, భూగర్భ గనుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి, శ్రీ సత్య సాయి ట్రస్టీ రత్నాకర్, ఎస్టీ కమిషన్ చైర్మన్ వి శంకర్ నాయక్, సత్య సాయి ట్రస్ట్ ప్రతినిధి చలం, జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్డీవో భాగ్యరేఖ, పుట్టపర్తి తహశీల్దార్ వేణుగోపాల్, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ అంజయ్య, తదితరులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు.

టిడిపిలో పలు కుటుంబాలు చేరిక



పార్టీలోకి చేరిన వారితో పరిటాల శ్రీరామ్



పార్టీలోకి చేరిన వారితో కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రంలోని షాదీ మహల్ లో ఆదివారం ఏర్పాటు చేసిన ముస్లిం ఆత్మీయ సమావేశంలో పలు ముస్లిం కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఈ సమావేశానికి హాజరైన టిడిపి ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో 161 ముస్లిం కుటుంబాలు తెలుగుదేశం పార్టీలోకి చేరారు, వారికి పరిటాల శ్రీరామ్ పార్టీ కండువాలు కప్పి టిడిపి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మండల కేంద్రంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ మినీ మేనిఫెస్టో పథకాల గురించి ప్రజలకి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్ బాబు, ప్రభాకర్ నాయుడు తుమ్మల మనోహర్, తుమ్మల సూరి, తుమ్మల నాయుడు, రాధమ్మ, రంగనాయకులు,, ధర్మవరం టిడిపి ముస్లిం నాయకులు నాగూర్ హుస్సేన్, బీబీ, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : వైసీపీ నుండి టీడీపీ లోకి వలసల పరంపర కొనసాగుతోంది. ఆదివారం పట్టణంలోని కందికుంట నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట సమక్షంలో కదిరి పట్టణం 31వ వార్డు కు చెందిన జెరిపిటి ప్రసాద్, జరిపిటి శ్రీరాములు టీడీపీ లో చేరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ హిందూపురం పార్లమెంట్ జిల్లా ఉపాధ్యక్షులు మోపురిశెట్టి చంద్రశేఖర్,5వ వార్డు ఇన్‌ఛార్జి షా ఫ్యాషన్స్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు. కదిరి రూరల్ మండలం ఎర్రదొడ్డి గ్రామ పంచాయతీ కొత్తపల్లి కి చెందిన70 కుటుంబాలు వైసీపీ ని వీడి కందికుంట సమక్షంలో తెలుగుదేశం పార్టీ పార్టీ లో చేరాయి. వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల కన్వీనర్ చెన్నకేశవులు, ఉపేంద్ర రెడ్డి, శంకర్ రెడ్డి, రామకృష్ణ నాయక్, అంజి, కరుణాకర్ రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు రాజశేఖర్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు మోపురిశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.